www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 17 జులై 2023



చెట్ల కొమ్మలు తొలగించాలి



వీధిలో ఉన్న చెట్ల కొమ్మలు

ప్రజాశక్తి-మండపేట

చెట్ల కొమ్మలు కొట్టడమే మా పని కానీ తొలగించే బాధ్యత మాది కాదు అనే విధంగా విద్యుత్ శాఖ పనితీరు ఉంది. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించడంలో భాగంగా ఆదివారం స్థానిక తరవాణిపేటలోని చిన్న వీధిలో చెట్ల కొమ్మలు కొట్టి అక్కడికక్కడే వదిలేశారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన రోజుల్లో అయితే విద్యుత్ శాఖ ఉద్యోగుల కొమ్మలు కొట్టడం పారిశుధ్య కార్మికుల తొలగించడం పరిపాటిగా మారింది. ఆదివారం కావడంతో కొమ్మలు తొలగించే నాధుడు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రామచంద్రపురం వైసిపిలో విభేధాలు

- మంత్రి వేణుకి వ్యతిరేకంగా బోస్ అనుచరులు ఆత్మీయ సమావేశం
- అధికారపార్టీలో వేడెక్కిన రాజకీయం



చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



పిల్లి సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియోజక వర్గంలోని అధికార వైసిపిలో విభేధాలు తారా స్థాయికి చేరాయి. మంత్రి వేణు, రాజ్యసభ సభ్యుడు బోస్‌ల గ్రూపుల మధ్య ఆదిప్యపోరు సాగుతోంది. ఆదివారం బోసు అనుచరగణం ద్రాక్షారామంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో గ్రూపు విబేధాలు బహిర్గమయ్యాయి. ఈ సమావేశంలో నియోజకవర్గంలో అధికారపక్షంలో రాజకీయం వేడెక్కింది. ఏ ఇద్దరు కలిసినా ఈ విబేధాలపైనే చర్చ ఉంటుంది.

2014 ఎన్నికల్లో వైసిపి నుంచి పిల్లి సుభాష్‌చంద్రబోస్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ అధిష్టానం ఆయనకు ఎంఎల్‌సి పదవి ఇచ్చి మంత్రని చేసింది. అనంతరం 2019 ఎన్నికల సమయంలో రామచంద్రపురం నియోజకవర్గానికి మాజీ జడ్‌పి ఛైర్మన్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఇన్‌ఛార్జిగా ఇక్కడ నియమించారు. బిసి సామాజిక వార్గనికి చెందిన నాయకులు, పార్టీకార్యకర్తలతో బోస్ సమావేశం ఏర్పాటు చేసి బోస్ మంత్రి వేణును పరిచయం చేశారు. ప్రజలు, స్థానికేతరులు వద్దంటూ సభలో గందరగోళం జరిగింది. అధిష్టానం ఆదేశం ప్రకారం నడుచుకోవాలని బోస్ వారికి సర్ది చెప్పారు. వేణును నాయకునిగా నిలబెట్టారు. అనంతరం వైసిఇప టిక్కెట్ కూడా అధిష్టానం వేణుకే కట్టబెట్టింది. వేణు గెలుపు కోసం కూడా బోస్ ప్రచారం చేశారు. చివరికి ఐదు వేల ఓట్ల మెజారిటీతో వేణు గెలుపొందారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో బోస్‌ను అధిష్టానం రాజ్యసభకు పంపింది. దీంతో బోస్ మంత్రి పదవిని వీడాల్సి వచ్చింది. ఆయన స్థానంలో వేణుకు మంత్రిగా అవకాశం లభించింది. అనంతరం నుంచి గ్రూపులు తయారయ్యాయి. ఈ నేపథ్యంలో బోస్‌తో సఖ్యతగా ఉన్న వారందరినీ వేణు దూరం పెడుతూ వచ్చారు. సొంత పార్టీకి చెందిన వారిపైనే అక్రమ కేసులు పెట్టి వేధించారనే ఆరోపణలు వేణుపై ఉన్నాయి. దీంతో బోస్ గ్రూపు నాయకులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదే సమయంలో బోసు కుమారుడు రాజకీయ రంగప్రవేశంతో మంత్రి వేణుపై ఉన్న అసంతృప్తి ద్రాక్షారామంలో ఆత్మీయ సమావేశం రూపంలో రోడ్డెక్కింది. అసంతృప్తి నాయకులంతా సమావేశం ఏర్పాటు చేసి వేణు పాల్పడుతున్న అవినీతిని బాహాటంగా విమర్శించడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

అసంతృప్తి లో ప్రజా ప్రతినిధులు

మంత్రి వేణుపై ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ప్రజాప్రతినిధులను పట్టించుకోక పోవడం, ఏదైనా పనిపై మంత్రి వద్దకు వెళ్తే చులకనగా మాట్లాడటం, పనులు చేయకపోవడంతో పలువురు ప్రజాప్రతినిధులు మంత్రికి ముఖం చాటేస్తున్నారు. దీనికి తోడు పంచాయతీకి నిధులు లేకుండా పనులు జరగక సొంత గ్రూపులో ఉన్న కొంత మంది కూడా దూరంగా ఉంటున్నారు. మంత్రి వేణు మాట నిలుపుకొని నేతగా ముద్ర పడ్డాడు. ఇక్కడ మున్సిపాలిటీ ఛైర్మెన్ పదవికి ఒసిలు, బిసిలు పోటీ పడ్డారు. ఇరు పక్షాలకు రెండున్నర ఏళ్ల చొప్పున పెద్దమనుషుల ఒప్పందం కుదిరింది. ఈ ప్రకారం మొదటి రెండున్నరేళ్లలో ఒసిల గడువు పూర్తయింది. కాని పదవిని బిసిలకు ఇంకా ఇవ్వలేదు. దీంతో వారు మంత్రి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు శేషారావు వర్గం దూరంగా ఉంటోంది. అలాగే రామచంద్రపురం ఎంపిపి స్థానానికి జరిగిన పెద్ద మనుషుల ఒప్పందంలోనూ మంత్రి వ్యవహారం ఇలాగే ఉండటంతో ఒకగ్రూపు మంత్రిపై ఆగ్రహంగా ఉంది. ఈ నేపథ్యంలో బోస్ లేదా ఆయన తనయునికి టికెట్ ఇస్తే పని చేస్తాం, లేదా ఇండిపెండెంట్‌ను గెలిపించుకుని మంత్రి వేణును సాగనంపుతామని చెబుతున్నారు.

ఇదిలా ఉండగా తనపై వస్తున్న ఆరోపణలను మంత్రి వేణు లైట్ తీసుకుంటున్నారు. తనకు అందరికీ నచ్చాలని లేదని, నచ్చని వారే ఇలా ఆరోపణలు చేస్తుంటారని తెలిపారు. తాను మాత్రం రామచంద్రపురం నుంచే పోటీ చేయాలని అనుకుంటున్నానని అంటున్నారు. జగన్ నిర్ణయాలనే తాను అమలు చేశానని, అధిష్టానం నిర్ణయం మేరకే నడుచుకుంటానని ఆయన అంటున్నారు.

టామాటా కిలో రూ.140



విక్రయానికి సిద్ధంగా ఉన్న టమాటాలు

ప్రజాశక్తి-మండపేట

అన్ని రకాల వంటకాలల్లో ఎక్కువగా వినియోగించే టమాటా ధర ఆకాశాన్ని అంటుతోంది. హోల్‌సేల్ మార్కెట్లో రూ.125కాగా రిటైల్ మార్కెట్లో రూ.140 పలుకుతోంది. ప్రధానంగా ప్రజల అవసరాల మేరా టమాటా అందుబాటులో లేక పోవడం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో టమాటా ధర అధికంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధాన మార్కెట్లో కేజీ రూ.140 నుంచి రూ. 160 పలుకుతుండగా రైతు బజార్లో రెండు రోజుల క్రితం రూ.72ఉన్న టమాట ధర ప్రస్తుతం రూ.140 పలుకుతోంది. ఈ నేపథ్యంలో రైతు బజార్లో కూరగాయలకు నో స్టాక్ బోర్డులు పెట్టడం కామన్‌గా మారింది. టమాటా, పచ్చిమిర్చి వెంటే మిగిలిన కూరగాయలు ధరలు పరుగులు పెడుతూ ఉండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు 200 కేజీలు టమాటాలు విక్రయిస్తున్నామని రైతు బజార్ అధికారులు చెబుతున్నప్పటికీ ఎప్పుడు మార్కెట్ కి వెళ్లిన టమాటాలు ఉండడంలేదని వినియోగదారులు చెబుతున్నారు. ఇలాఅయితే వండుకు తినేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మడిలో బాధితుని కుటుంబానికి సాయం అందజేస్తున్న కొత్తపేట ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు పలువురు ఆర్థిక సాయం అందించారు. వివరాలు ఇవి.

ఆలమూరు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మండలంలోని మడికికి చెందిన మందపల్లి కల్యాణ్ వైద్య ఖర్చుల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం రూ.50,000 ఆర్థిక సాయం అందచేశారు. ముందుగా ఎంఎల్ఎ తన నివాసం నుంచి కిడ్నీ రోగితో ఫోన్ లో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో స్పందించిన ఆయన నేతల సమక్షంలో వైద్య ఖర్చులకు నగదు సాయం చేశారు. అలాగే ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, నేతలు దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, మోటూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం అనారోగ్యంతో బాధపడుతున్న చల్లపల్లి పంచాయతీ పర్రపేటకు చెందిన నేల నాగమణికి అమలాపురం నియోజకవర్గ వైసిపి నాయకులు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆదివారం నిత్యావసర సరుకులతోపాటు ఆర్థిక సాయం అందించారు. సాయం అందించిన రమణారావుకు నాగమణి ఆమె కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, నాగాబత్తుల రాజ్ కుమార్, కుంచే అర్జున్, నేరేడుమిల్లి శ్రీను,పరమట రాజేష్, దోనిపాటి రాంబాబు, పోలినాటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డర్ల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అమలాపురం

బాడీ బిల్డింగ్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తూ క్రీడాకారులకు 2శాతం రిజర్వేషన్, వ్యాయామ కళాశాల నిర్వహణకు ప్రభుత్వ నుంచి సబ్సిడీ రుణాలను ఇచ్చేలా కృషి చేస్తానని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఒంటెద్దు వెంకన్న నాయుడు అన్నారు. అమలాపురంలో హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్‌లో ఆదివారం జరిగిన కోనసీమ జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం కు హాజరైన 22 మండలాల బాడీ బిల్డింగ్ ప్యానల్ మెంబర్స్ వెంకన్న నాయుడుని అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కూడా ఎంపిక జరిగింది. నూతన సభ్యులను ముఖ్య అతిథిగా విచ్చేసిన పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనుముల కృష్ణ పద్మరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. కోనసీమ బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా నగబేరి కష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా గారపాటి చంద్రశేఖర్, పెట్ల రాజబాబు(మండపేట), జి.లక్ష్మీనారాయణ(ద్రాక్షారామ), జాయింట్ సెక్రటరీగా టి.అబ్బులు (ఆలమూరు), జి.నరేష్(ముమ్మిడివరం), జి.గణేష్‌బాబు(మలికిపురం), ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా డి.శంకర్(అమలాపురం), ఎస్‌కె వలీసాహెబ్ (మురమళ్ళ), అడ్వైజర్ జి.రారాజు(పల్లవారిపాలెం), జడ్జెస్ కమిటీ కన్వీనర్ కె.రవిసుధీర్(కొంకాపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు(కొత్తపేట), జనరల్ సెక్రెటరీ కంకిపాటి వెంకటేశ్వరరావు ఎంపిక అయ్యారు. కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులుగా నాలుగు సంవత్సరాలు పాటు బాధ్యతలు నిర్వహిస్తారని సెక్రెటరీ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. నూతన సభ్యులను ఎనుముల కృష్ణపద్మ రాజు, ఎం.వి.సముద్రం, డి.ఆర్కే. నాగేశ్వరరావు, జి.దొరబాబు, సిహెచ్.రాజబాబు, రెడ్డి నాయుడు, లక్ష్మణరావు, సత్యనారాయణ, బాడీ బిల్డింగ్ క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్ననాయుడు



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

వెంకన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి


ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి మనవేంద్రనాథ్‌రాయ్ సందర్శించారు. వీరికి ముందుగా ఆలయ ఛైర్మన్ రమేష్‌రాజు, ఇఒ సత్యనారాయణ రాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శేష వస్త్రాల తో పాటు స్వామివారి చిత్రపటం ఆయనకు అందజేశారు

నిత్యాన్నదానానికి విరాళాలు

వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిమిత్తం పలువురు దాతలు విరాళాలను ఆదివారం ఆలయ ఛైర్మన్ రమేష్‌రాజు, ఇఒ సత్యనారాయణ రాజుకు అందజేశారు. హైదరాబాద్ చెందిన డి.వెంకటరమణరావు, విజయలక్ష్మి దంపతులు రూ.11, 116, రావులపాలెం మండలం కోమరాజులంక చెందిన వై.సత్యనారాయణ రూ.10,116, ముమ్మిడివరానికి చెందిన జె.నాగేశ్వరరావు,అమరావతి దంపతులు రూ.10,116, పంగిడిగూడెం చెందిన ఎమ్.సుబ్రహ్మణ్యం,స్వప్న దంపతులు రూ.10,500, కాకినాడ చెందిన వి.గణేష్ రూ.10,500 విరాళాన్ని అందజేశారు.

కార్టూ'నిజం'



స్వదేశంలో... ఎవరూ నమ్మడం లేదయ్యా మరి..!!!

నడకతో మోకాళ్లకు సంరక్షణ

ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

స్థూలకాయం కారణంగా వ్యాయామం లేకపోవడం వల్ల, అధిక బరువూ కండరాలలోని బలహీనత వల్ల మోకాళ్ల నొప్పులు వస్తాయని, మోకాళ్ల రక్షణకు నడక మంచి ఔషధమని ప్రముఖ ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ చొల్లంగి అన్నారు. అమలాపురం సాయి సంజీవిని వాకర్స్ యోగ ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక ఎస్‌కెబిఆర్ కళాశాల రోడ్డు లో గల అనిల్ ఆర్థోపెటిక్ సర్జరీ ఆసుపత్రి హాలులో 'మోకాళ్ల నొప్పులు తీసుకోవలసిన జాగ్రత్తలు అవగాహన' అనే అంశంపై జరిగిన ఆరోగ్య సదస్సులో డాక్టర్ అనిల్ కుమార్ ప్రసంగించారు. స్థూలకాయలు కారణంగా శరీర బరువును ఎక్కువగా మోయడం వల్ల జాయింట్స్ అరుగుదల ఏర్పడి మోకాల్ల నొప్పులు వస్తాయని ఆయన వివరించారు. రోజు 45 నిమిషాల వేగంగా నడవడం వల్ల లేదా రోజూ పదివేల అడుగులు నడవడం వల్ల శరీర బరువును త్వరితగతిని నియంత్రించుకోవచ్చని అన్నారు. నడక వ్యాయామం వల్ల కండరాలకు కణ జాలానికి ఆక్సిజన్ సరఫరా శాతం పెరుగుతుందని తద్వారా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయన అన్నారు. తొలుత కార్యదర్శి నల్లా నరసింహమూర్తి వాకర్స్ ప్రార్థనను ఆలపించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంతర్జాతీయ వాకర్స్ ఏరియా వన్ కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నడక అవగాహనతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆరోగ్య సంస్థ అభినందించారు. మహిళా డైరెక్టర్ జల్లి సుజాత ప్రసంగించారు. అనంతరం హెచ్ఐవి బాధిత చిన్నారులకు పోషకాహారం కిట్లను డాక్టర్ అనిల్ కుమార్ , జల్లి సుజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోపిశెట్టి నాగేశ్వరరావు, చాట్ల లక్ష్మీనారాయణ, కోశాధికారి బివివి.సత్యనారాయణ, జానీ వాకర్ కడలి సత్యనారాయణ, జంగా రాజేంద్ర కుమార్, డాక్టర్ మంగళంపల్లి అరుణ్ కుమార్, పసలపూడి సతీష్, ఎ.సతీష్‌కుమార్, జి.శీను పాల్గొన్నారు.

శెట్టిబలిజలు టిడిపికి అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్నరెడ్డి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

శెట్టిబలిజలు టిడిపికి అండగా నిలవాలని శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం అన్నారు. అల్లవరం మండలం కోడూరుపాడు సత్య కస్తూరి కల్యాణ మండపంలో టిడిపి రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గుబ్బల నాగేశ్వరరావు జిల్లా సాధికార సమితి డైరెక్టర్ ఆధ్వర్యంలో అల్లవరం మండల శెట్టిబలిజ సాధికార సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రెడ్డి సుబ్రమణ్యం, అమలాపురం అసెంబ్లీ ఇన్‌ఛార్జి అయితా బత్తుల ఆనందరావు, టిడిపి రాష్ట్ర కమిటీ కార్యదర్శి గుత్తుల సాయి, రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, నియోజక వర్గ పరిశీలకులు పెచెట్టి బాబు, శెట్టిబలిజ రాష్ట్ర సాధికారిక కమిటీ అధ్యక్షులు కుడిపూడి సత్తిబాబు, మండల ఛైర్మెన్ దెందుకూరి సత్యనారాయణ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సుబ్రమణ్యం మాట్లాడుతూ టిడిపిని అధికారంలోకి తీసుకువస్తే అమలాపురంలో రూ.ఐదు కోట్లతో దొమ్మేటి వెంకటరెడ్డి పేరుతో శెట్టిబలిజ కళ్యాణ మండపం నిర్మిస్తామని, నామినేటెడ్ పదవులులో శెట్టిబలిజలకు ప్రాధాన్యత ఇస్తామని , అమలాపురం అల్లర్లలో అక్రమంగా కేసులను పెట్టినకేసులను ప్రత్యేక జిఒ తీసుకువచ్చి కేసులు తీసివేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో శెట్టిబలిజ వర్గీయిలు టిడిపికి అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ కుల, మత వర్గాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలని కలుపుకుని ముందుకు వెళుతున్నాను అన్నారు. పలువురు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షులు గెడ్డదా శ్రీనివాసరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుల్లియ్య ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు

ఘనంగా బంగారం పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి- అంబాజీపేట

పుల్లేటికుర్రు టిడిపి నాయకులు బొట్టు బంగారం పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఏర్పాటు చేసిన కేకును బంగారం కేకు కట్ చేశారు. ఆయనకు పూలదండలు వేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుల్లియ్య ఏర్పాటు చేసిన దుప్పట్లు సర్పంచ్ జల్లి బాలరాజు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి నాయకులు యడ్లపల్లి తుక్కియ్య,నేదునూరి వెంకట రమణ, పెట్టా కష్ణ, కిశోర్, జి.సాయి, అంకం విఘ్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు



ప్రముఖులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. దార్ల పాపయ్యాచారి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇనస్టలేషన్ అధికారి డాక్టర్ డివిఅర్.పూషా పాల్గొని నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షునిగా ఏడిద కవీంద్ర, కార్యదర్శిగా చిట్టినీడి లక్ష్మణ రావు తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు పదవీ స్వీకారం చేసారు. పూషా మాట్లాడుతూ రాజోలు రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని అన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు కవీంద్ర, లక్ష్మణరావులు మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించేందుకు రోటరీలో చేరామన్నారు. తమ పదవీ కాలంలో ప్రజలకు మరింత సేవలందించి రాజోలు రోటరీ క్లబ్ కు మరింత గుర్తింపు తీసుకు వస్తామని అన్నారు. ఈ సందర్భంగా లూటుకుర్రు పిహెచ్‌సికి రోటరీ క్లబ్ ద్వార మెడికల్ కిట్ పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో విజేతగా నిలిచిన ఎర్రంశెట్టి ఉమా లక్ష్మి రమణికి, రోటరీ భోజనశాలకు రూ.పది లక్షలు ఆర్థిక సాయం అందించడంతో పాటు పోలియో నిర్మూలనకు రూ.పదివేలు విరాళం అందించిన శాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సోమిశెట్టి ఆంజనేయులుకు రోటరీ క్లబ్ సభ్యులు సత్కారం చేసి మెమెంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివ కుమార్, లక్కింశెట్టి చిన్మయుడు, కాసు శ్రీను, నామన షణ్ముఖ్, కసుకుర్తి రామకష్ణ, డాక్టర్ బసవ వరహాలు, బొరుసు తిరుమల రావు, బోళ్ల శ్రీను, నార్కిడిమిల్లి బాలకష్ణ, ఐ.సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న లంక భూముల పరిశీలన



నేతలకు వివరాలు తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని బడుగువానిలంక గ్రామ రెవెన్యూ పరిధిలో గోదావరి నది వరద తాకిడికి కోతకు గురవుతున్న లంక భూములను సిపిఐ మండల కార్యదర్శి కొండే రామకష్ణ, బిఎస్‌పి కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ 1977లో చుట్టుపక్కల గ్రామాల పేదలకు లంక భూములకు డి పట్టాలు ప్రభుత్వం అందజేసిందన్నారు. అయితే అప్పటినుండి ప్రతి ఏటా లంక భూములు గోదావరి నదీ కోతకు గురవుతూ వరద నీటిలో కొట్టుకుపోవడం జరుగుతోందన్నారు. ఈ క్రమంలో సుమారు 400 కుటుంబాలు వారు భూమిని కోల్పోయి నిరుపేదలుగా మిగిలారని వారు తెలిపారు. ముఖ్యంగా కోతకు గురి అవ్వకుండా ఉండాలంటే గ్రోయిన్ల నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా పటిష్టమైన చర్యలు చేపట్టలేదన్నారు. ఇటీవల కాలంలో రిలయన్స్ కంపెనీ బడుగువానిలంక గ్రామస్తులకు గ్రోయిన్లు కడతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు గ్రోయిన్లు నిర్మాణానికి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం గోదావరికి వరద తాకిడి పోటెత్తుతూ ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి భూములు కోతకు గురవకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సిపిఐ, బిఎస్పి బందాలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.



పరామర్శిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

బాధిత కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో బాధిత కుటుంబాలను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబ స్థానిక 23,27 వార్డుల్లో తానారపు భాస్కరరావు, కాళ్ళ అచ్చయ్యమ్మ కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, చింతల శ్రీను, లంకలపల్లి రాంబాబు, వలీజాని తదితరులు ఉన్నారు.

రోడ్డుపై మట్టి తొలగింపు

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల కురిసిన వర్షాలకు మండపేట-రామచంద్రపురం రోడ్డుకి రెండు వైపులా మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి గోతులపడి పాడవుతోంది. సామాజిక కార్యకర్త చిర్ల శ్రీనివాసరెడ్డి పలుచోట్ల పేరుకుపోయిన మట్టిని తొలగించి, నీరు పోయేందుకు దారి ఏర్పాటు చేశారు. శీనివాసరెడ్డి శ్రమను గుర్తించిన స్థానికులు ఆయనకు అభినందించారు. గతంలో ఇతను ప్రమాదాల నివారణలో భాగంగా గోతులను సొంత ఖర్చుతో పూడ్చారు.

హెచ్‌ఎంల సంఘ అధ్యక్షునిగా వెంకట్రాజు



ముంగర వెంకట్రాజు

ప్రజాశక్తి-మండపేట

రామచంద్రపురం డివిజన్ ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షులుగా ముంగర వెంకట్రాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ ప్రముఖులతో పాటు ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం, పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయన ప్రస్తుతం ఏడిద జెడ్‌పి ఉన్నత పాఠశాలహెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. పాఠశాలలతో పాటు ఉపాధ్యాయులకు సేవలు సేవలందించేందుకు కృషి చేస్తానని వెంకట్రాజు అన్నారు.

ర్యాపిడ్ రేటింగ్ టోర్నీలో 'విక్టరి' విద్యార్థుల ప్రతిభ..



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -అమలాపురం

నెల్లూరులో జరిగిన మస్తానయ్య ఇంటర్నేషనల్ ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వివిధ దేశాల నుంచి ఐదువందలకు పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలలో ద్రాక్షారపు సాత్విక్ ప్రఖ్యాత కర్ణాటక క్రీడాకారుడు ఐ.ఎమ్ టైటిల్ గ్రహీత దేవకి ప్రసాద్ పై విజయం సాధించాడు. అలాగే రేటింగ్ కేటగిరిలో ద్వితీయ స్థానం సాధించి రూ.3వేల నగదు బహుమతి సుమారు 150 రేటింగ్ పాయింట్లు సాధించాడు. మరో క్రీడాకారుడు బండారు నానిబాబు అన్ రేటింగ్ కేటగిరిలో ప్రథమ స్థానం సాధించి రూ.3వేల నగదు బహుమతి పొందాడు. అలాగే చింతపల్లి సూర్య, తోలేటి శ్రీకాంత్ ప్రత్యేక బహుమతులు సాధించారని విక్టరి ప్రిన్సిపల్, కోనసీమ చెస్ అసోసియేషన్ కన్వీనర్ తాడి వెంకట సురేష్ తెలిపారు.

'ఉపాధి'లో విరివిగా మొక్కల పెంపకం

ప్రజాశక్తితో డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రచించించామని కాకినాడ జిల్లా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం మొదలుకొని మొక్కలు పెరిగేంతవరకు దాదాపు అన్ని ఖర్చులు ప్రభుత్వం అందిస్తోంది. ఈ పథకంపై చాలామందికి పూర్తిస్థాయి అవగాహన లేక ప్రభుత్వం అందించే రాయితీలకు దూరమవుతున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై ఆమె ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ఎన్ని ఎకరాల్లో ఉద్యాన తోటలు పెంచనున్నారు.?

హార్టికల్చర్ ప్లాంటేషన్ లో భాగంగా మొక్కల పెంపకానికి ఇప్పటి వరకు 234.25 ఎకరాలు పరిపాలనా మంజూరు తీసుకోవడం జరిగినది. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఉద్యాన తోటల పెంపకం రైతులను గుర్తించడం, పరిపాలనా ఆమోదం పూర్తి చేశాం. ఈనెల 7నాటికి గుంతలు



తవ్వడం, 15 నాటికి మొక్కలు నాటడం పూర్తి చేశామన్నారు. హార్టికల్చర్‌లో భాగంగా ఫ్లోరి కల్చర్‌లో గులాబీ, మల్లె తోటలను పెంచడానికి 12.75 ఎకరాలు పరిపాలనా మంజూరు తీసుకున్నామన్నారు.

మునగ పెంపకం ఎన్ని ఎకరాల్లో సాగు జరుగుతుంది.?

మునగ మొక్కల పెంపకం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 15 ఎకరాలు అంచనాలు తయారు చేసి, 8 ఎకరాలు పరిపాలనా మంజూరు చేశామన్నారు. లబ్ధిదారుల గుర్తింపు ఇంకా జరుగుతుంది. రైతుల ఆసక్తిని బట్టి పొలం గట్ల మీద కొబ్బరి, మునగ, టేకు తదితర రకాలు వేసుకోవచ్చు. 10 ఎకరాలు లక్ష్యంగా తీసుకున్నాం.

కమ్యూనిటీ ప్లాంటేషన్ లక్ష్యం ఎంత తీసుకున్నారు.?

కాలవగట్లు, అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఇప్పటి వరకు 3 కిలోమీటర్లు వరకూ పరిపాలనా మంజూరు తీసుకున్నాం. ఇంకా పనులు గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంది. వీటికి సంబంధించిన మొక్కలను డ్వామా నర్సరీ నుంచి పంపిణీ చేస్తాం. కొబ్బరి, మామిడి, మునగ తదితర రకాల మొక్కలను చెరువు గట్లు, పంచాయతీ ఖాళీ స్థలాల్లో వేసుకోవచ్చు. ఇప్పటి వరకు 12 ఎకరాలు పరిపాలనా మంజూరు తీసుకున్నాం.

ప్రభుత్వ సంస్థల్లో ఏయే రకాల మొక్కలను పెంచుతారు.?

ప్రభుత్వ సంస్థల్లో అన్ని రకాల పండ్ల మొక్కలు, నీడ నిచ్చే మొక్కలను వేసుకోవడానికి అవకాశం ఉంది. ప్రహరీ ఉండి నీటి వసతి గల ప్రభుత్వ సంస్థల్లో కనిష్టంగా 50 మొక్కల నుంచి 1000 మొక్కల వరకు వేసుకోవచ్చు. త్వరలో వీటిని పంపిణీ చేస్తాం.

డ్వామా నర్సరీలు ఎక్కడెక్కడ ఉన్నాయి.?

కమ్యూనిటీ ప్లాంటేషన్‌నకు మొక్కలు సరఫరా చేయడానికి డ్వామా నర్సరీలను ఏర్పాటు చేశాం. తాళ్లరేవు మండలం డ్వామా నర్సరీలో సుమారు 5000 మొక్కలు పంపిణీకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో పిఠాపురం మండలం ఎఫ్‌కె.పాలెం, శంఖవరం మండలం కేంద్రంలో నర్సరీలను గుర్తించాం. ఇక్కడ 50 వేల మొక్కలకు రూ.6 లక్షల వరకూ నిధులు అంచనా వేస్తున్నాం.

మునగ మొక్కల పెంపకానికి ఎటువంటి చర్యలు చేపట్టారు.?

ప్రతీ మహిళకు ఆరోగ్య పరిరక్షణ పెంపొందించడానికి మునగ మొక్కలను అందిస్తున్నాం. మునగలో కాల్షియం, ఐరన్ తో సహా అనేక పోషకాలు ఉన్నందున ప్రతీ ఇంటికి ఒక మునగ మొక్క ఇవ్వాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించింది. గత సంవత్సరం కాకినాడ రూరల్ మండలంలో 5 వేల మొక్కలకు వేతనదారులకు పంపిణీ చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం గండేపల్లి మండలాన్ని గుర్తించాము. ఆసక్తి ఉన్నవాళ్లు ఉపాధి హామీ పథకం సిబ్బందిని సంప్రదిస్తే మొక్కలను అందజేస్తాం.

'వేలం' దుమారంపై ఇఒ దిద్దుబాటు చర్యలు

సంభావన హక్కు కింద టెండర్ పిలిచే ఆలోచన

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానంలో పెళ్లిళ్లకు ఉపనయనాలకు నిర్వహణ చేసే పురోహితులకు దేవస్థానం అధికారులు ఇటీవల నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్ణయం అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా పలు బ్రాహ్మణ సంఘాల నిరసనలతో రాజకీయ దుమారం రావడంతో దేవస్థానం ఇఒ ఆజాద్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు ఇందులో భాగంగా, పెళ్లిళ్ల ఉపనయనాలు నిర్వహణకు సింగిల్ సింగిల్ విండో విధానం ద్వారానే పురోహితులకు సంభావన హక్కు కింద టెండర్ లేదా నామినేషన్ పద్ధతిలో ఇచ్చేందుకు ఆలోచిస్తున్నామని, ఈ అంశంపై ఈ నెలలో 23న జరిగే పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు అంతేగాక ఈ విధానం కూడా స్థానిక పురోహితులకు రెండు మూడు బ్రాహ్మణ సంఘాలకు ఈ సంభవన హక్కు లైసెన్స్ పొందే విధంగా నిబంధనలు రూపొందించే ఆలోచన కూడా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా బయట ఉన్న బ్రాహ్మణ సంఘాలు ఈ విధానం రద్దు చేయమని రద్దు చేయకుంటే ఆందోళన చేస్తామని, ఈనెల 28న అమలాపురం వచ్చే ముఖ్యమంత్రి జగన్ కూడా కలిసి తమ నిరసనలు గురించి చెబుదామని ఇప్పటికే స్థానికేతర బ్రాహ్మణ సంఘాలు పలు సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయినా దేవస్థానం ఆజాద్ తనదైన శైలిలో పురోహితులకు సంభావన హక్కు, లైసెన్స్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం ఏదేమైనా దేవస్థానం ఇఒ తీసుకుంటున్న నిర్ణయాలు గోరుచుట్టుపై రోకలి పోటు అన్న రీతిలో ఉంటున్నాయని ఈ సందర్భంగా స్థానికేతర పురోహితులు బ్రాహ్మణ సంఘాల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

యానాం వార్తలు



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

ఘనంగా పెన్షనర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కమలా నెహ్రూ గర్ల్స్ హై స్కూల్ ప్రాంగణంలో యానాం పెన్షనర్స్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవ వేడుకలు అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్ఎఒ మునిస్వామి, ఎస్పి రఘునాయగం పాల్గొని అసోసియేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. యానాం పెన్షనర్స్ అసోసియేషన్ ప్రారంభించి 25ఏళ్లుపూర్తి చేసుకున్న సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్స్‌ను అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అనంతరం జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గత సంవత్సరం మరణించిన పెన్షనర్స్‌కి నివాళు లర్పించారు. అసోసియేషన్‌కి సంబంధించి ఇతర అంశాలను చర్చించారు. అసోసియేషన్ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే తక్షణమే 25 వేల రూపాయలు సహాయాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పడాల వెంకటేశ్వరరావు,సెక్రటరీ బస్సా వెంకన్న, వైస్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, ట్రెజరర్ దంగుడుబియ్యం సత్యనారాయణ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ ఆధ్వర్యంలో స్థానిక కెఎన్‌జిజి హైస్కూల్లో నిర్వహించిన యానాం పెన్షనర్స్ అసోసియేషన్ వార్షికోత్సవ సభలో సుమారు 150 మందికి సోమవారం నేత్రదానంపై అవగాహన కల్పించినట్లు ప్రెసిడెంట్ పులవర్తి శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులచే నేత్రదానం ప్రతిజ్ఞ చేయించి, పత్రాలపై సంతకాలు సేకరించామన్నారు. ఈ కార్యక్రమానికి దంగుడుబియ్యం సత్యనారాయణ, దుళ్ళ రామకృష్ణ సహాయ సహకారాలు అందించారన్నారు.

నేరాలు ఘోరాలు



నాగులపల్లిలో దారుణం

అత్త, భార్యపై కత్తితో దాడి

అత్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

భార్య, అత్తపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో అత్త అక్కడిక్కడే మరణించగా భార్య తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలైంది. ఈఘటన నాగులాపల్లి శివారు ఉప్పరగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దండు శ్రీను, సింహాచలంకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శ్రీనుకు ముందు నుంచి భార్య సింహాచలంపై అనుమానం ఉండేది. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో ఆమె తరచూ ఉప్పరగూడెంలో పుట్టింటికి వచ్చేది. అయితే ఏడాదిగా సింహాచలం పుట్టింటి వద్దే ఉంటోంది. శ్రీను కూడా ఇక్కడే ఉంటున్నాడు. అయినా అనుమానం తగ్గలేదు. దీంతో భార్యను హతమార్చాలని అనుకున్నాడు. ఆదివారం ఇంటి వద్ద పనులు చేసుకుంటున్న భార్యపై కత్తితో దాడికి తెగబడ్డాడు. దీనిని చూసిన సింహాచల తల్లి గుర్రాల రాణి(50) అడ్డుకుంది. వారించే ప్రయత్నం చేసింది. ఈ సమయంలో శ్రీను ఆమెపై కూడా దాడికి పాల్పడ్డాడు. ఆమెకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సింహాచలంను స్థానికులు హుటాహుటిన పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పిఠాపురం సిఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి దుర్మరణం

నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు, రామచంద్రపురం

ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తాళ్లరేవు మండలం కోరంగి కనకదుర్గమ్మ గుడి వద్ద 216వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఐషర్ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన బి.నాగవెంకటగంగాధర్, ఏడిద హర్షవర్ధన్ బైకుపై కాకినాడ వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఐషర్ వ్యాను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షత గాత్రుని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఆదివారం కాకినాడ నుంచి యానాం వైపు తాటిపాక ఒఎన్‌జిసి సైట్‌కి వెళ్తున్న ట్యాంకర్‌ను కాకినాడ వైపు వెళ్తున్న బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో పెదపూడికి చెందిన సతీష్, రాజేష్‌లకు బలమైన గాయాలయ్యాయి. సంఘటన స్థానానికి చేరుకున్న కోరంగి ఎస్.ఐ. శ్రీనివాస్ కుమార్, 108 సిబ్బంది క్షతగాత్రులను కాకినాడ జిజిహెచ్.కు తరలించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మందాలమ్మ పేటకు చెందిన దుర్గటి భైరవ స్వామి కోటిపల్లి రోడ్డుపై వస్తుండగా శివల గ్రామానికి చెందిన బత్తుల అరుణకుమార్ యానాం వైపు నుంచి వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన వీరిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి ద్రాక్షారామ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి-గోకవరం

సారా బట్టీలపై ఆదివారం ఎస్ఇబి అధికారులు దాడులు నిర్వహించారు. నలుగురిని అరెస్టు చేశారు. రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన గంధం మరిడియా, గంధం అర్జున్, కేత ఈశ్వరరావు, అరుగొల్లి సూర్యచంద్రం కృష్ణునిపాలెం శివారులో సారా బట్టీలు నిర్వహిస్తున్నారు. ఎస్ఇబి సిబ్బంది దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి 25 లీటర్ల సారా, 2 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్ఇబి అధికారులు తెలిపారు.

క్వారీ గోతుల్లో యువకుడి మృతదేహం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం- జగ్గంపేట రహదారి సూరంపాలెం పుంతలో ఉన్న క్వారీ వద్ద ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఉన్న యువకుడి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన నడిపల్లి వంశీ(28)దిగా గుర్తించారు. సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ వి.సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బిసిల కులగణనే ఎజెండా

బిసిల ఆత్మగౌరవ సభలో వక్తలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

బిసిల కులగణనే ఎజెండాగా ముందుకు సాగాలని బిసిల ఆత్మగౌరవ సభలో వక్తలు పిలుపునిచ్చారు. కాకినాడ సూర్య కళామందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అధ్యక్షత వహించగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఈశ్వరయ్య,పార్లమెంట్ సభ్యులుపిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఈశ్వరయ్య మాట్లాడుతూ బిసిలకు సమగ్ర శాస్త్రీయ కులగణన నిర్వహించిన నాడే రిజర్వేషన్లు సాధించుకోగలమన్నారు. ఎప్పటినుంచో కుల గణనను అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తూ వస్తున్నాయన్నారు. బిసిల హక్కుల కోసం ఏ ఒక్క రాజకీయ నాయకుడు కూడా పోరాటం చేయలేదన్నారు. హక్కుల కోసం పోరాడాలన్నారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ బిసిల జనగణన కోసం ముఖ్యమంత్రి జగన్ ప్రయత్నం చేస్తే హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. కుల గణన కోసం జరిపే పోరాటానికి మల్లాడి నాయకత్వం వహించాలన్నారు. మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండ బాబు మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలనేది కలగానే మిగిలిపోతుందన్నారు. మాజీ మంత్రి మల్లాడి మాట్లాడుతూ బిసిల హక్కుల కోసం పోరాటమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. రాజకీయ పార్టీల్లో దొంగ బీసీలు ఉన్నారని, దొంగ సర్టిఫికెట్లతో రాజకీయాల్లో చలామణి అవుతున్నారని మల్లాడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఎ.రమేష్, చెల్లుబోయిన వేణుగోపాల్, ఎం.భాస్కర్‌గణేష్, పి.దుర్గారమేష్, మాజీ ఎంఎల్‌సి బలశాలి ఇందిర, ఎస్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

కౌలుకు చేస్తున్న పొలం విషయంలో వివాదం రావడంతో పురుగుల మందు తాగిన పికె.రాయపురం గ్రామానికి చెందిన కరణం రమణ ఆదివారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం ఈ నెల 4న బోయినపూడిలో కౌలుకు చేస్తున్న పొలం విషయంలో కుటుంబ సభ్యులతో గొడవల కారణంగా పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారని పోలీసులు తెలిపారు. కుమారుడు కరణం సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

మునికూడలి ఇసుక ర్యాంపులో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మునికూడలిలో ఇసుక ర్యాంపులో ఆదివారం ఎస్ఇబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. జగనన్నకు చెబుదాంలో నమోదు కాబడిన అర్జీ మేరకు మునికూడలి, వెదుళ్లపల్లి రైతుల పట్టా భూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. పట్టాభూములు ప్రక్కలంక రెవెన్యూ పరిధిలో ఉన్నందున ప్రక్కలంక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరుకొండ ఎస్ఇబి సిఐ సత్యనారాయణ రైతులకు తెలిపారు. అనంతరం కాటవరంలో నిల్వచేసిన ఇసుక గుట్టలకు సంబంధించి విచారణ చేశారు. సిఐ సత్యనారాయణ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మునికూడలి ఇసుక ర్యాంపులో ఇసుక తరలించిన ప్రాంతంలో వరద నీరు చేరడంతో ఎంతమేరకు తవ్వకాలు జరిగాయో అంచనాలు తెలియదని తెలిపారు. ఈ మేరకు నివేదిక అందిస్తామన్నారు.



ర్యాంపు పరిశీలనకు వచ్చిన అధికారులు

200 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత చర్మం వ్యాధుల వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. కాకినాడ నుంచి డాక్టర్ చిత్రలేఖ తదితరులు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఈ వైద్యసేవలు పొందారు. వైద్యులు, మెడికల్ రిప్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పిఎంపి కె.విజయ్ కుమార్, ఉప్పాడలో ఉన్న సూర్య మెడికల్ షాప్ యజమాని మాట్లాడుతూ. మారుతున్న కాలంలో స్కిన్ డిసీస్ అనేదే ప్రతి ఒక్కరికీ వస్తుందన్నారు. చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మల్లేపల్లి శివారులో పెట్రోల్ బంకు ఎదురుగా ఆదివారం ఒక కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు ముందుగా వెళ్తున్న బైకును తప్పించబోయి అదుపుతప్పి సెంటర్ డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ వాహనం సిబ్బంది వచ్చి కారును డివైడర్ పైనుంచి తొలగించారు.



సీజనల్ వ్యాధులతో ముప్పు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

వర్షాలు అధికంగా కురవడంతో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, విష జ్వరాలు వేధించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ గౌరీ శేఖర్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కాలంలో జలుబు, దగ్గు, ఎసిడిటి, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు కూడా వేధిస్తాయన్నారు. వీటి నివారణకు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బయట ఆహార పదార్థాలను తీసుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ , బుద్ధ రాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

త్రినిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రమణయ్యపేట ఆంజనేయ నగర్ ఆదర్శ వయోవృద్ధుల ఆశ్రమంలో త్రినిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఖండవిల్లి షాలిని మాట్లాడారు. వృద్ధాప్యంలో కీళ్లకు సంబంధించిన వ్యాధులు వేధించే అవకాశం ఉందన్నారు. కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కీళ్లలో నొప్పి లేదా వాపు, చర్మంపై ఎర్రటి మచ్చలు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, కండరాల బలహీనత తదితర లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స తీసుకోవాలన్నారు. అదేవిధంగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న నిరుపేద కుటుంబాలకు చెందిన వృద్ధులు అనారోగ్యంగా ఉన్నా వైద్యులను సంప్రదించలేని పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి స్థితిలో సామాజిక బాధ్యతగా త్రినిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కిషోర్ పేకేటి, వీరేంద్ర, సునీత తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

భూసమస్యలపై నేడు కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గుర్రప్పాలెం పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 270/2ఎ లో ఉన్న 10.9 ఎకరాల భూమికి సంబంధించిన సమస్యలపై సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. మండలంలోని రామవరం శివారు రంగవల్లి నగర్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ భూమిని గుర్రప్పాలెంలో ఉన్న దళితులు, పేదలు సాగుచేసుకుని ఉపాధి పొందేవారన్నారు. జగ్గంపేట ఎంఎల్ఎ అనుచరులు ఈ భూమిని దళితుల నుంచి దౌర్జన్యంగా లాగేసుకున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆరు నెలలుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా, అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం పక్కనబెట్టి రాజకీయ నాయకులకి వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. దీంతో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చామన్నారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి కె.సతీష్, డివిజన్ నాయకులు సురేష్, పిఒడబ్ల్యు స్త్రీ విముక్తి నాయకురాలు దేవి పాల్గొన్నారు.

వాసవి అమ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాడమాసం ముగింపులో భాగంగా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు భారీ ఎత్తున సారె సమర్పించారు. కోటగుమ్మం సెంటర్‌లో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి ఆర్యవైశ్య మహిళలు స్థానిక రామకృష్ణ కళ్యాణ మండపం నుంచి పెద్ద బజారు మీదుగా ర్యాలీగా సారెను తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఆర్యవైశ్య మహిళలు తెచ్చిన వివిధ రకాల పువ్వులు ,పండ్ల రకాలు, పలు రకాలు స్వీట్లు, వస్త్రాభరణాలు ఆలయాన్ని, అమ్మవారిని అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు వాసవి మహిళా భక్త సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని కేశవరం గ్రామంలో పల్లపువీధిలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపిటిసి సభ్యులు అన్నందేవుల కష్ణతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో కేశవరం గ్రామం అభివద్ధి బాటలో నడుస్తుందన్నారు.

6వ రోజుకు రైతుల రిలే నిరాహారదీక్ష

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని గోకివాడలో అక్కినీడి వారి చెరువుకు నీరు వెళ్ళే పుట్టకుంట కాలువపై అధికారులు తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటు చేయాలని రైతులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో రైతులు నామా శివయ్య, గాది సుబ్రహ్మణ్యం, నామా పూసలు, గరగ వెంకట్రావు, అమలకంటి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అధికారులు షట్టర్లు తొలగించడంతో గ్రామంలో పంటలకు నీరందట్లేదన్నారు. తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటుచేసి సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నామా వెంకట్రావు, గరగ సత్యానందం, వెలుగుల పద్దరాజు, కొత్తెం స్వామి, కాయల పవన్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు శాకాంబరి అలంకరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని రామారావుపేటలో నూకాలమ్మను ఆదివారం శాకాంబరి అవతారంలో అలంకరించారు. చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఇఒ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆలయాన్ని మొత్తం పండ్లు, పువ్వులు, ఇతర ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారి పూర్తిగా ఆకుకూరలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గుడ్డుతో పలు ప్రయోజనాలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

గుడ్డుతో పలు ప్రయోజనాలున్నాయని విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు గుడ్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోటీన్, కాల్షియం, అనేక విటమిన్లు కలిగిన గుడ్డు పోషకాలకు మూలమన్నారు. గుడ్డులో విటమిన్-ఎ ఎక్కువగా ఉండటంతో కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. మంచి కొలెస్ట్రాల్ స్థాయిని కూడా పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, జి.కృష్ణమోహన్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహాన్ని నిర్లక్ష్యం చేయరాదు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

మధుమేహాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయరాదని గ్రంథాలయ విశ్రాంతి ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో త్రినిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచితంగా రక్త పరీక్షలు, బిపి పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షల ద్వారా శరీరంలో చక్కెర స్థాయిని తెలుసుకుని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా త్రినిటీ ఆసుపత్రి పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.